నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 1 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జైనూర్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కందులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, జడ్పీటీసీ, ఎంపీపీ

పేదింటి బిడ్డల భవిష్యత్‌కు బాట

పాలనా సౌలభ్యం కోసమే భవనం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లింగాపూర్,జనవరి 31: ప్రజా పాలనా సౌలభ్యం కోసమే కొత్త జీపీ భవనాలను ప్రారంభిస్తున్నట్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని కంచన్‌పల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన జీపీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పాత భవనాల్లో నడుస్తున్న పంచాయతీ కార్యాలయాలకు గత కేసీఆర్ ప్రభుత్వం కొత్తవి మంజూరు చేసిందన్నారు. పదవీ కాలం ముగిసిన సర్పంచ్ కనక జ్యోతిరాంను శాలువాతో సన్మానించారు. ముళ్లగూడ గ్రామాన్ని సందర్శించారు. ఆదర్శ అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడె సవిత, జడ్పీటీసీ రక్కాబాయి, వైస్ ఎంపీపీ ఆడె ఆత్మారాం, ఎంపీడీవో జోయల్ ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆత్రం అనిల్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు సలీం, సీడీపీవో ఇంద్రావతి, సూపర్‌వైజర్ లైలా, ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, జనవరి 31: మండలంలోని వ్యవసాయ శాఖ సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్నిజైనూర్ మార్కెట్ గోదాంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. రైతులు పండించిన కందులను నేరుగా ఈ కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. ఎంపీడీవో ప్రభుదయా, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చెర్లె లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ కోడప హన్మూ పటేల్, ఏవో పవన్ కుమార్, మాజీ సర్పంచ్ మెస్రం పార్వతీలక్ష్మణ్, రాహుల్, మడావి భీంరావ్, పెందోర్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ అబ్బు, సీఈవో జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన!

నేటితో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం

ఇక అధికారుల చేతుల్లోకి పగ్గాలు..

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 31 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాల పాలన నేటితో ముగిసింది. ఇక ప్రత్యేకాధికారుల పాలనలోకి గ్రామాలు వెళ్లనున్నాయి. మళ్లీ ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారుల పాలనలోకి గ్రామాలు వెళ్లనున్నాయి. తమకు మరో ఆరు నెలలు అవకాశం కల్పించాలని ప్రస్తుత సర్పంచ్‌లు చేసిన విన్నపాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానుంది. పంచాయతీలకు 2019లో ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2 నుంచి పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1తో గడువు ముగుస్తోంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, అలా జరగలేదు. పార్లమెంట్ ఎన్నికల రీత్యా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇక గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు తోడుగా ప్రత్యేకాధికారులతో పాలన కొనసాగించనున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ హోదా కలిగిన ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవోలు, తదితర అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తారు. చిన్న జీపీలకు నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను ఇన్‌చార్జిలుగా నియమిస్తారు. సుమారు ఆరు నెలల పాటు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

భీమారం జడ్పీహెచ్ఎస్‌లో కెరీర్‌గైడెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

సర్కారు బడుల్లో పిల్లల కోసం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం

- కలల సాకారం దిశగా విద్యార్థులకు ప్రోత్సాహం
- లక్ష్యాన్ని సాధించేలా అవగాహన కార్యక్రమాలు
- అదనపు కలెక్టర్ రాహుల్ ప్రత్యేక చొరవతో సత్ఫలితాలు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పెద్దయ్యాక నువ్వు ఏం అవుతావ్..అని స్కూళ్లో టీచర్ అడిగినప్పుడు డాక్టర్, ఇంజినీర్, కలెక్టర్, పోలీస్ అని పిల్లలు చెబుతుంటారు. ఇలా డాక్టర్ కావాలనుకునే పిల్లోడి దగ్గరికి ఓ డాక్టర్ వచ్చి తాను ఏం చదివితే ఈ వృత్తిలోకి వచ్చానో చెబితే, కలెక్టర్ కావాలనుకునే విద్యార్థికి ఓ కలెక్టర్ నేరుగా తాను ఎంత కష్టపడితే, ఏం చదివితే కలెక్టర్ అయ్యానో చెప్తే ఎలా ఉంటుంది..? ఆ పిల్లలు భవిష్యత్తులో ఏం కావాలని కలలు కంటున్నారో దాన్ని సాధించే ప్రయత్నం చిన్ననాటి నుంచే మొదలవుతుంది. చిన్నతనంలో లక్ష్యసాధనకు అవసరమైన బలమైన పునాది పడుతుంది. కచ్చితంగా అనుకున్నది సాధించాలనే తపన, ఆరాటం పెరుగుతుంది. సరిగ్గా దీన్నే ఆచరణలో పెట్టి చూపిస్తున్నారు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీ రాహుల్. గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకునే పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలనే సంకల్పంతో 'కెరీర్ గైడెన్స్' పేరిట అద్భుతమైన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

ప్రతి మూడో శనివారం 'కెరీర్ గైడెన్స్'..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి మూడో శనివారం పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహిస్తుంటారు. పిల్లల తల్లిదండ్రుల సూచనలను పరిగణలోకి తీసుకొని టీచర్లు పని చేస్తుంటారు. ఈ ప్రోగ్రాం రాష్ట్రవ్యాప్తంగా మంచి ఫలితాలు ఇస్తున్నది. ఈ మీటింగ్‌లను విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా మార్చేందుకు అదే రోజున కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా జిల్లాలోని లక్షెట్టిపేటలోని సోషల్ వెల్ఫేర్ హై స్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు దండేపల్లి మండలం వెల్గనూర్ జడ్పీఎస్ఎస్ హై స్కూల్‌లో నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అద్భుత స్పందన రావడంతో జిల్లాలోని 18 మండలాల్లో 18 పాఠశాలలను ఎంపిక చేసి డిసెంబర్ 16వ తేదీన తొలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జనవరి 20వ తేదీన మరో 18 స్కూళ్లలో చేశారు. నెలకు 18 స్కూళ్ల చొప్పున జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు 132 స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలు, సీఐలు, మెడికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమానికి హాజరై తాము ఉద్యోగాలు ఎలా సాధించాం.. ఏం చదువుకున్నాం.. పదో తరగతి అయ్యాక ఏ కోర్సుల్లో చేరాం.. ఎలా కష్టపడ్డాం.. అంశాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. ఇలా కెరీర్‌పై స్పష్టతతో విద్యార్థులు ముందుకెళ్లేలా ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతున్నది.

లక్ష్యంతో ముందుకెళ్లాలి

పిల్లలు భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నారో ఆ లక్ష్యంపై విద్యార్థి దశలోనే స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లాలి. ఆ స్థాయి అవగాహన విద్యార్థుల్లో తీసుకురావడం కోసం తీసుకువచ్చిందే ఈ 'కెరీర్ గైడెన్స్'. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తున్నది. మండలస్థాయిలో ఒక గ్రూప్స్ స్థాయి అధికారి, టీఎస్పీఎస్సీ నుంచి వచ్చిన అధికారి, ఇతర పోటీ పరీక్షలు రాసి వచ్చిన అధికారులు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అన్ని శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. రానున్న రోజుల్లో మిగిలిన హై స్కూల్స్‌లోనూ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం చేస్తాం.

-బీ రాహుల్, మంచిర్యాల అదనపు కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, జనవరి 31: రైతులు కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందులకు ఈ ఏడాది మద్దతు ధర ఎక్కువగా ఉన్నందునా, దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే కందులను అమ్ముకోవాలన్నారు. విక్రయించే సమయంలో పట్టా పాసుబుక్కు,ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ ప్రతిని కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్, సింగల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ ,నాయకులు గోపాల్ నాయక్, బాపురావు ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ విస్తృత పర్యటన

సిర్పూర్(టీ), జనవరి 31: సిర్పూర్(టీ) మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టీ) సామాజిక దవాఖాన, జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న వివరాలపై ఆరా తీశారు. సిర్పూర్(టీ) సామాజిక వైద్యుడు చెన్నకేశవ, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్(ఫైల్)

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- కుమ్రం భీం జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 4362 మంది విద్యార్థులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31: జిల్లా వ్యాప్తంగా గురువారం(ఫిబ్రవరి 1) నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మూడు దశల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 23 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 12 సెంటర్లు జనరల్ విద్యార్థుల కోసం, 11 ఒకేషనల్ విద్యార్థుల కోసం కేటాయించారు. మొత్తంగా 2816 మంది జనరల్ విద్యార్థులు, 1546 మంది ఒకేషనల్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎగ్జామినర్ల నియామకాలు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై ఆదేశాలిచ్చారు.

మంచిర్యాల జిల్లాలో..

మంచిర్యాల అర్బన్, జనవరి 31 : జిల్లాలో మొదటి విడుత ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 7106 మంది ఫస్టియర్ విద్యార్థులు, 7031 సెకండియర్ విద్యార్థులు ఉన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..

ఫిబ్రవరి 1 నుంచి మూడు విడుతల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేశాం. ఎలాంటి సమస్యలున్నా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తాం.

-నైతం శంకర్, ఆసిఫాబాద్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి

అధైర్యపడొద్దు..అండగా ఉంటా

- కార్యరకర్తలతో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపిద్దామని పిలుపు

దండేపల్లి, జనవరి 31: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకుండా ముందుకు సాగాలని, వారికి తనతో పాటు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ద్వారక గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, తాను ప్రజల మధ్యే ఉంటానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజా క్షేత్రంలో ఉంటూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పిలుపునిచ్చారు. తన హయాంలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. కాసిపేటలో లిఫ్టును సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, సర్పంచ్ శాంతయ్య, బీఆర్ఎస్ నాయకులు బండారి మల్లేశ్, గోళ్ల రాజమల్లు, మంద రాజయ్య, శంకర్‌రావు, కస్తూరి వెంకటేశ్, ముచ్చర్ల తిరుపతి, తదితరులున్నారు.

స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కౌటాల, జనవరి 31: మండలంలోని తుమ్మిడిహెట్టి పంచాయతీ పరిధిలోని పీపీ నగర్‌లో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ నిధులు రూ. 2.50 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భూమిపూజలో పాల్గొని పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు నాణ్యతతో నిర్మించేలా గ్రామస్తులు చూసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచ్ చరణ్ దాస్, నాయకులు రాజేందర్ గౌడ్, వాసు పటేల్, మల్లయ్య, సత్తయ్య, మృత్యుంజయ ఉన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

ప్రాణహిత, గోదావరి తీరంలో ఎన్డీఆర్ఎఫ్ టీమ్

నదుల్లో ప్రమాద ప్రాంతాల సందర్శన

కోటపల్లి, జనవరి 31 : ప్రాణహిత, గోదావరి నదుల తీరాల్లో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఎన్డీఆర్ఎఫ్ టీం సందర్శించింది. కోటపల్లి మండలంలోని అర్జునగుట్ట, లక్ష్మీపూర్, బోరంపల్లి, ఎర్రాయిపేట సమీపంలోని ప్రాణహిత, గోదావరి నదీ తీరాలను సందర్శించిన ఎన్డీఆర్ఎఫ్ టీమ్ ఇన్‌చార్జి సురేశ్, గతంలో జరిగిన ప్రమాదాల గురించి తెలుసుకున్నారు. నదుల లోతు, ప్రమాదానికి కారణాలను ఆర్ఐ రాజలింగును వాకబు చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్ రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదీ తీరంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ టీమ్, ఆర్ఐ

దేశ నిర్మాతలు విద్యార్థులే...

కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ

మంచిర్యాలటౌన్, జనవరి 31: దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ అన్నారు. మంచిర్యాలలోని వివేకానందుని డిగ్రీ, పీజీ కాలేజీలో ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రోగ్రాం అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే తోటివారికి సహాయ పడేలా జాతీయ సేవా పథకం శిక్షణ నిస్తుందని తెలిపారు. ఒకరికొకరు సహకరించుకోవడం మానవతా లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు గ్రామాల్లో పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంపూర్ణ అక్షరాస్యత, వయోజనవిద్య, జనాభా నియంత్రణ, అంటువ్యాధులు, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ తిరుపతి, నిర్మల్ జిల్లా కన్వీనర్ మురళి, ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్, మోహన్, సుధాకర్, కిషోర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, జనవరి 31: పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మంచిర్యాల డీఈవో యాదయ్య సూచించారు. జిల్లాలోని హాజీపూర్, భీమారం, నస్పూర్, దండేపల్లి, మందమర్రి, జైపూర్, లక్షెట్టిపేట, మంచిర్యాల మండలాల్లోని కేజీబీవీల ఎస్వోలు, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ పది సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న ప్రణాళికలు అడిగి తెలుసుకున్నారు. ఏసీజీఈ దామోదర్ రావు, డీసీఈబీ సెక్రటరీ కొండు భీమ్‌రావ్, సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి, యశోదర, మండల విద్యాధికారులు పోచయ్య, రాధాకృష్ణమూర్తి, డీసీఈబీ సహాయ కార్యదర్శి కుమార స్వామి పాల్గొన్నారు.

మిగిలింది రెండు నెలలే..

- ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల వసూలుకు గడువు
- మంచిర్యాల మున్సిపాలిటీలో రూ. 10.33 కోట్ల బకాయిలు

మంచిర్యాలటౌన్, జనవరి 31: మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు లక్ష్యం కొండంత ఉండగా, గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగానే కనబడుతోంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలలే మిగిలి ఉండగా, ఇంకా రూ. 10.33 కోట్లు వసూలు చేయడం అంత సులువయ్యేలా లేదు. ఇప్పటికే ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినప్పటికీ, ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తుల ఆన్‌లైన్, పాలకవర్గంపై అవిశ్వాసం, పండుగ సెలవులు తదితర కారణాలతో కొంత ఆటంకం ఏర్పడుతున్నది. మున్సిపాలిటీలో ఈ ఏడాది ఆస్తిపన్ను రూ. 17.92 కోట్ల వసూలు లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు రూ. 7.60 కోట్లు (42.39 శాతం) మాత్రమే చేశారు. ఇంకా రూ. 10.33 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మొండి బకాయిలు ఎక్కువగా ఉన్న స్లమ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి నిలపాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం గత నెలలో ప్రత్యేకంగా టీంలను ఏర్పాటుచేశారు. వీరంతా నిత్యం ఉదయం ఏడు గంటలనుంచి 10 గంటల వరకు వారికి కేటాయించిన స్లమ్ ఏరియాల్లో పర్యటించి ఇంటి యజమానులను కలిసి పన్ను చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. అవసరమైన వారికి కొంత సమయం ఇచ్చి ఆ గడువులోగా పన్ను వసూలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఉదయం సెషన్‌లో ఈ బృందాల వసూళ్ల అ నంతరం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు, తిరిగి మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయం త్రం ఆరుగంటల వరకు వారికి కేటాయించిన బ్లాకుల్లో పన్నుల వసూళ్లు చేపడుతారు. ఒక టో నంబర్ టీం సభ్యులు రాజీవ్‌నగర్, దొరగారిపల్లి, తిలక్‌నగర్,సాయికుంట, మజీద్‌వాడ ప్రాంతాలు, రెండో నంబర్ టీం సభ్యులు ఎన్టీఆర్‌నగర్, పాతగర్మిళ్ల, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో, మూడో టీం సభ్యులు పాతమంచిర్యాల, రంగంపేట, రాళ్లపేట, అండాళమ్మకాలనీ, అంబేద్కర్‌నగర్ ఏరియా ల్లో వసూళ్లకు వెళ్లనున్నారు. గడువులోగా ఆస్తిపన్ను వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తెలిపారు. సిబ్బంది అంతా ఆస్తిపన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారని చెప్పారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం రేపటికి వాయిదా

నస్పూర్,జనవరి 31 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2024లో భాగంగా గురువారం నిర్వహించాల్సిన ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం శుక్రవారానికి వాయిదా పడినట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడిగా నియమితులైన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి భారతీ లక్‌పతి నాయక్‌తో నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ సమావేశం జరగనుంది. ఫిబ్రవరి 1న రాష్ట్ర రాజధానిలో అన్ని జిల్లాల కలెక్టర్ల సమావేశం ఉన్నందునా, ఈ సమావేశం 2వ తేదీకి వాయిదా పడినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు హాజరు కావాలని కోరారు. జిల్లా శాఖల ప్రగతి నివేదికలతో రావాలని పేర్కొన్నారు.